


# నన్ను దోచుకొందువటే...

ఏనుగంటి వేణుగోపాల్

వీధిలో వాళ్లు విద్ధారపోయారు. ఆఫీసంతా హాశ్చర్యపోయింది. బంధువులంతా నివ్వెరపోయారు. ఫ్రెండ్సేమో 'ఔరా' అని ముక్కు మీద వేలేసుకున్నారు!

గోపాలమనబడే సదరు క్యారెక్టర్‌కి అంత 'ఎవరు'న్నదన్న మాట మరి గోపాలమా, మజాకా? అతను పన్చేసేది కూడా 'ఎలక్ట్రిసిటీ' డిపార్టుమెంటు.

ఆగండాగండి.

అసలా సకలజనుల విభిన్న నిట్టూర్పులకి నిజకారణం బేమిటంటే-

రూపాయి ఖర్చుకి లక్ష టైమ్స్ మైండు చించుకునే పిసినారి గోపాలం... తెగించి ఇన్నాళ్లకి ధైర్యంగా సెల్ కొనడం!

అతడు సెల్ కొనుగోలు చేసిన ఉత్తరక్షణం... ఆ కంపెనీ యమ అర్జెంటుగా దివాలా తీసిందనుకోండి. అది వేరే విషయం.

రేట్లు తగ్గాయ్, తగ్గాయంటే తక్కువకే కొన్నాడు. అయినా దిగులు. అదనంగా అనవసరంగా ఇదొక ఖర్చే కదా! అని.

మా కనెక్షన్‌కి మారండి, మారండని ప్రకటనల్తో తెగ ఊదర గొడ్తుంటే... పోన్లేమ్మని కొంత ఉచిత టాక్ టైమ్ స్కీమ్‌తో వెంటనే పాపులర్ కంపెనీ 'బైబై'లోకి హుందాగా మారిపోయాడు.

ఆ సందర్భంగా టీ-బిస్కట్లంటూ ఆఫీస్ స్టాఫ్ వందకి ఆముదం రాశారు. ఇంటి దగ్గర అమ్మలక్కలంతా భార్య చేత స్వీట్స్‌కి మరో వంద వదలించారు. చిరు పార్టీ అంటూ సాయంత్రం ఫ్రెండ్స్ సరే సరి. వెరసి ఉత్తుత్తినే అయిదొందలు రా!

హతోస్మి! తెగ గింజుకున్నాడు గోపాలం. ఆ రోజు సుఖంగా నిద్ర పడితే ఒట్టు, ఇక పోతే మనవాడికి మరో చిక్కొచ్చి పడింది. మొబైల్‌ని ఆపరేట్ చేయడం అంతగా రాదు. ఎలాగబ్బా అని బుర్ర తడుము కున్నాడు. ఇక స్వయంగా యుద్ధరంగానికి దిగాలని డిసైడయ్యాడు. ఎవర్నైనా కన్సల్ట్ చేద్దామంటే ఇన్సల్ట్ అన్పించింది మరి!

గతంలో సెల్ గురించి వాళ్లూ, వీళ్లూ చెప్పినవి, అనుకోగా విన్నవి, ఫ్లాష్ బ్యాక్ నుండి బయటకు లాగి, అది నొక్కి ఇది నొక్కి, కూడనివి సైతం కంగారులో నొక్కేసి, అలసిసొలసి చూస్తే ఏముంది?

వంద బ్యాలెన్స్ గాయబ్!

గోపాలానికి గుండెలో గుండు సూది గుచ్చినట్టయ్యింది. స్ట్రోక్ వచ్చే వయసు కాదు కాబట్టి గుండె పోటు లంగరేయలేదు.

సరే వీటన్నింటినీ పక్కన పెడితే... ఆలస్యంగానైనా గోపాలం ఓ 'సెల్' వాడైనందుకు ఇంటిల్లిపాదికీ 'దీపావళి' అయ్యింది. గోపాలం గుండెనేమో 'ధా'మ్మంటోంది.

ఓ శుభోదయవేళ భర్త చెంత చేరిన భారతి "మీరిపుడెంత 'స్వీట్'గా ఉన్నారో?' అంటూ అకాల'భజన' మొదలెట్టింది.

"ఇంకా 'చక్కెర' వ్యాధేం రాలేదులే!" అని, తన కామెడీ పంచ్‌కి తనే గలగలా నవ్వేశాడు.

పైగా "మరి క్రీస్తు పూర్వం, అనగా మన పెళ్లి చూపులపుడు... నేను 'ఖారా'లా ఉన్నానా?" అంటూ డబల్ ఛలోక్తి రువ్వాడు.

"అబ్బో! అబ్బబ్బో! పెళ్లి కాని డజనుమంది ఆడపిల్లల తండ్రిలా ఎప్పుడూ దిగాలుగా ఉండే మీ ఫేసు, బాపు కార్టూన్ బొమ్మలా కామెడీలోకి మారిందోచ్!" అంటూ మురిసిపోతూ తెగ పొగిడేసిందా ఇల్లాలు.

'రసగుల్లా'లా ఉబ్బిపోయాడు గోపాలం. "అది సరే! మరి మ్యాటరేంటీ?" భార్య వాలకం ఎరిగినవాడు కనుక డైరెక్ట్‌గా అడిగేశాడు.

"ఈ రోజు సండేగా!"

"నిన్న సాటర్ డేగా. తప్పదు కాబట్టి సండేనే వస్తుంది మరి..."

"అబ్బా! ఆగండి. 'మా చీర మీ మ్యాచింగ్' ప్రోగ్రామ్ వస్తుందండీ టీ.వీ.లో. మన మొబైల్ నిక్కడి నుండి ఖంగుమని మోగిస్తే అక్కడి నుండి చెంగుంవని ప్రశ్నలడుగుతారు. బోల్డు ఖరీదు చేసే చీరలిస్తారు. ఉచితం కదా! ప్లీజ్... ఓసారి సెల్ ఇవ్వరూ?" గోముగా గోకింది గోపాలాన్ని.

"సర్సర్లే!"

ఉచితమంటే పాకిస్థాన్‌కైనా పరుగు తీసే రకం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అపోజ్ చేయని ప్రతిపక్షంలా సైలెంటై పోయి, గమ్మునిచ్చాడు మొబైల్‌ని.

భారతి సంబరంగా వెళ్లి టీవీ ముందు ఫిక్సయింది. టీవీ పడని గోపాలం బయటకు తుర్రుమన్నాడు.

'మా చీర-మీ మ్యాచింగ్' ప్రోగ్రామ్ వచ్చే చానెల్ ఓపెన్ చేసి, వాళ్ల నంబర్ కొరకై తెర మీదికి చూపుల్ని ఫోకస్ చేసింది. ఆ నంబర్ చిక్కింది తుదకు. భారతి కూడా గోపాలానికి డిటో డిటో! కాల్ చేయడం మాత్రమే ఎరుగును. అందుకే వాళ్ల నంబర్ స్క్రీన్ మీద దర్శనమవడం ఆలస్యం, గబగబా నొక్కేసింది సెల్.

నంబర్ స్టోరేజ్, వగైరాలింకా తెలియని భారతి, ప్రతి సారీ తెర పైకి వీక్షించడం కాల్ పంపడం... విసుగొచ్చిన తరుణంలో... 'లక్' రింగై ఆమె మొబైల్‌ని తట్టింది.

వంటా, వార్పు, తిండీతిప్పలు, అలవాట్లు, అభిరుచులు వగైరా చెత్తబుట్ట కబుర్లన్నీ అడిగి ఆరా తీసి సాగతీసింది యాంకరమ్మ (బిల్లు పడేది వారిక్కాదుగా)!

ఎగ్జామ్ పేపర్ రాసిన మరుక్షణం నుండే రిజల్ట్స్ కోసం ఆబగా ఎదురుచూసిన స్టూడెంట్‌లా, భారతి ఎగ్జయిట్‌మెంట్‌కి లోనయ్యింది. ఏ చీర నా దరి చేరునో కదా! అని ఊహాలోకాల్లో తేలియాడింది.

"బీ రెడీ! సింపుల్ క్వశ్చన్, కరెక్ట్ సమాధానమిస్తే మీ చీర మాకే! ఛ...ఛ! మా చీర మీకా!" అంది యాంకరమ్మ ఓవరాక్షన్ చేస్తూ.

"అడగండడగండి..." తెగ ఉబలాటపడిపోతోంది భారతి.

"మీరిందాక ఫోన్ చేసిన మా నంబర్‌ని ఆగకుండా గబగబా అప్పచెప్పగలరా?" చూసింది. ఆ టైముకి స్క్రీన్‌పై నంబర్ లేదు. మటుమాయం! ఏం చేసేది?

తుస్ తుస్...! ఢాం ఢాం...!!

యాంకరమ్మ సెలవిచ్చిన గడుపు హుష్ కాకీ!

"నాకు డౌటొచ్చే ఈ క్వశ్చన్ అడిగా. ఎనీ హౌ...నెవర్ బ్యాడ్! మరో సారి 'ట్రై' చేయండి. ఇంట్లో 'ఫ్రై' కాదు. బెస్టాఫ్ లక్!" యాంకరమ్మ నవ్వుతో గిల్లుతూనే ఫోన్ డిస్‌కనెక్ట్ చేసింది.

చీర చిక్కకపోయినా భారతి బానే ఉంది బ్యాలెన్స్‌డ్‌గా.

ప్చ్! తీరిగ్గా వచ్చి సెల్ బ్యాలెన్స్ చెక్ చేసుకున్న గోపాలం గుండెలో రాయి బ్లాస్టయ్యింది. మనిషి 'రోస్ట్' అయ్యాడు.

యాంకరమ్మ బాతాఖానీ దురదకి 'ఫుల్'గా ఉన్న బ్యాలెన్స్ కాస్తా 'నిల్' అయ్యింది.

000

"మొబైల్ ఎక్కడున్నాదీ... మీ మొబైల్ ఎక్కడున్నాదీ..." కుదరకపోయినా కర్ణకఠోరంగా పాటెత్తుకుంటూ పరుగుపరుగున ఊడిపడ్డాడు పక్కింటి శ్రీపాదం.

"అది నా జేబులోనే ఉన్నాదీ..." శ్రుతి కలిపిన గోపాలం చప్పున ఆపి, నాలిక్కరుచుకున్నాడు. తనకీ జబ్బేంటని? పాడు బుద్దేంటని?

"గోపాలం గారూ! ఓ సారి మీ బుజ్జి సెల్ ఇస్తారా?" డైరెక్ట్‌గా ఎటాక్ చేశాడు.

"ఇవ్వను. ఇవ్వను గాక ఇవ్వను!"

"ఆపను, పాడడం ఆపను గాక ఆపను. తర్వాతేం జరిగినా మీదే బాధ్యత!" బెదిరించాడు.

"హవ్వా! సెల్ కూడా చేబదులు అడుగుతారా! ఇదేం వింత? ఇదేమి చోద్యం?" కళ్లు మిటకరించి "సెల్లు నా కంటే ముందు మీకుందిగా?" అంటూ బుంగమూతి పెట్టాడు.

"మా పెద్దబ్బాయి తీస్కెళ్లాడు. దగ్గరున్న కిరాణా కొట్టులో కాయిన్ బాక్స్ అవుటాఫ్ ఆర్డరుట. నాకేమో అర్జంట్. యమ టెన్షన్‌గా ఉంది" అంటూ తొందరపెట్టాడు.

"కుదర్దు!" మొహమాటం లేకుండా కరాఖండిగా చెప్పేశాడు.

"మరి నేనో పాటేస్కుంటా!" హైజాకింగ్, బ్లాక్ మెయిల్ వగైరాలన్నీ మిక్స్ చేసి ప్రయోగించాడు శ్రీపాదం.

గోపాలం అస్సలు తగ్గలేదు.

"అలాగైతే నే వాంతి చేస్కుంటా!" అంటూ కోరసయ్యాడు.

"సెల్ ఇవ్వకుంటే నా 'ఆడియో క్యాసెట్' వినక తప్పదు మరి." శ్రీపాదం డిమాండ్ పర్సంటేజ్ కూడా దిగలేదు.

వాస్తవానికి శ్రీపాదానికి మామూలు వాయిస్ కాదు. గరగర కంఠుడు గొంతు విప్పాడంటే ముప్పే! బుర్ర బొప్పే! రోజంతా తల

**శ్రీపాదం ఇంట్లో కరెంటు లేదుట (వీధిలోనే లేదు) కరెంటాఫీసులో వన్నేసే గోపాలం ఇంట్లో కరెంటుందని వచ్చాట్ట. మరా సెల్‌లో మాట్లాడ్తున్న మ్యాటరేంటంటే, క్రికెట్ మ్యాచ్ గురించి వివరాలడుగుతున్నా డెవరినో, గంటల ముల్లు కదులుతున్నంత స్లో మోషన్‌లో. మరా బ్యాలెన్సేమో సెకన్ల ముల్లులా రన్నింగ్ చేస్తోంది! లబలబలాడాడు గోపాలం. నెత్తీ నోరూ బాదుకున్నాడు. గోపాలం యాక్షన్ చూళ్లేక రియాక్టయిన శ్రీపాదం జాలిపడి, అతడి సెల్ అతడికి తిరిగిచ్చేసి దర్జాగా వెళ్లిపోయాడు.**

నొప్పే!

"ఇదెక్కడి శాపంరా బాబూ! సెల్లివ్వనంటే సిల్లీగా పాడతానంటాడు?" విసుక్కున్నాడు గోపాలం అరచేత్తో నుదురు చరుచుకుంటూ.

ఇంతకీ శ్రీపాదం ఘనత ఏ పాటిదంటే... ఉన్న పళంగా పేరడీ కట్టేస్తాడు. తన పైత్యం కక్కేస్తాడు. బతికుండగానే పాడె ఎక్కిస్తాడు. ఆసాంతం వినేవాడి తాట ఒలిచేస్తాడు!

"కడవెత్తు కొచ్చిందీ కన్నెపిల్లా...' అనే ఓల్డ్ క్లాసిక్‌ని 'కుక్కెత్తు కొచ్చిందీ మక్కెకున్నా...'గా ట్యూన్ చేసి చంపేస్తాడు.

'నిన్నే...నిన్నే..' లేటెస్ట్ హిట్‌ని 'తన్నే... తన్నే... కాల్తో తెన్నే...'గా మార్చేసి గుండె చీల్చేస్తాడు.

ఏ జన్మలో చేసిన ఘోరపాపమో, ఈ జన్మలో వడ్డీతో కలిపి వసూలు చేస్తున్నాడు. పక్కింట్లోకి శనిలా దాపురించాడు. తిట్టుకున్నాడు గోపాలం.

జిద్దు వదిలిపెట్టదని "ప్లీజ్! రెండంటే మరి రెండే కాల్స్ చేసుకోవాలి. అసలే నాది వీకెస్ట్ బడ్జెట్..." రివర్స్ గేర్‌లో తనే ప్రాధేయపడ్తూ సెల్ శ్రీపాదానికి సమర్పించాడు గోపాలం... 'గోవిందాయ నమః' అని తెలిసీ.

"అలాగలాగే!" పోజెట్టి వరమిచ్చాడు శ్రీపాదం.

తన కోర్టులోకి వచ్చిన బంతి, తనిష్టం, తాపీగా హాయిగా మాట్లాడ సాగాడు. కుతకుతలాడిపోతోంది గోపాలానికి, పట్టించుకోలేదు శ్రీపాదం.

శ్రీపాదం బంకలా సెల్‌ని వదలకుండా మాట్లాడ్తున్న మ్యాటర్ బయటకు లీకై గోపాలం ఘొల్లుమన్నాడు.

శ్రీపాదం ఇంట్లో కరెంటు లేదుట (వీధిలోనే లేదు) కరెంటాఫీసులో వన్నేసే గోపాలం ఇంట్లో కరెంటుందని వచ్చాట్ట. మరా సెల్‌లో మాట్లాడ్తున్న మ్యాటరేంటంటే, క్రికెట్ మ్యాచ్ గురించి వివరాలడుగు తున్నా డెవరినో, గంటల ముల్లు కదులుతున్నంత స్లో మోషన్‌లో. మరా బ్యాలెన్సేమో సెకన్ల ముల్లులా రన్నింగ్ చేస్తోంది!

లబలబలాడాడు గోపాలం. నెత్తీ నోరూ బాదుకున్నాడు.

గోపాలం యాక్షన్ చూళ్లేక రియాక్టయిన శ్రీపాదం జాలిపడి, అతడి సెల్ అతడికి తిరిగిచ్చేసి దర్జాగా వెళ్లిపోయాడు.

శ్రీపాదం వెళ్లాక చూసుకుంటే, రెండే రెండు కాల్స్ అని చెప్పినవాడు పదిహేను కాల్స్ తగలెట్టాడు. చెప్పనేలేదు. గోపాలం వేయించుకుంది లైఫ్ కార్డ్. నిమిషానికి కాల్‌కి రెండు రూపాయల చొప్పున ముప్పై గోవిందా... గోవింద!

000

"నాన్నా! నాకోసారి సెల్ ఇవ్వు" చెంగుచెంగున పరుగెత్తుకొచ్చిన జూనియర్ గోపాలం ఆర్డరేశాడు, సీనియర్ గోపాలాన్ని.

"వన్ రుపీ కాయినిస్తా. బయట చేసుకో!"

"షేమ్ షేమ్! ఇంట్లో సెల్లుండీ కాయిన్ బాక్స్ ఎందుకని శ్రీపాదం అంకుల్‌వాళ్ల బుజ్జి దెప్పుతోంది" అంటూ తండ్రికి కౌంటరేశాడు.

"ఆర్నీ! సెల్ విషయంలోనూ టీజింగేనా? పైగా అమ్మాయిలు అబ్బాయిల్నా? మరేమో దాని బాబుకైతే పక్కింటోడి సెల్ కావాలి. హు!" తిట్టి పోశాడు. పైగా కొడుకుని అనుమానంగా చూశాడు గోపాలం.

ఆ చూపులు పసిగట్టిన జూనియర్, "నేను టెంతిపుడు. నాకిపుడిపుడే ప్యార్ కీ కహానీలేం లేవు గానీ, సొల్లాపి సొల్లివ్వండి!" అన్నాడు జబర్దస్తీగా.

"ఇదెక్కడి గొడవరా బాబూ..." అరచేత్తో బట్టగుండు తడుముకుంటూ, "ఇంతకీ తమరికి సెల్లెందుకో సెలవిచ్చి చచ్చారు కాదు!" వాయిస్ తగ్గించి జూనియర్ వంక గుర్రుగా చూశాడు గోపాలం.

"అలా దారికి రా నాన్నా!' అన్నట్టు ప్రహ్లాదుడిలా ఓ నవ్వు నవ్వాడు. " 'టట్టడాం' చానెల్ వాళ్ల 'ఆంధ్రా జీకే-వన్ లాఖ్ మీకే! జూనియర్స్ కాంటెస్ట్‌లో ఓకే అవుదామని."

"లక్ష నీకేనంటావా?" వెటకారంగా అడిగాడు.

"వస్తే లాక్కోరాదూ?" దెప్పిపొడిచాడు.

"తమరిది మట్టి బుర్రేగా!" వెక్కించాడు. తండ్రి

"మీ నుండి వారసత్వంగా సంక్రమించిందేగా!" తండ్రికే నిప్పంటించాడు.

చురచుర మండింది గోపాలానికి. కొరకొరా చూశాడు కొడుకు వంక. సెల్ ఇవ్వకపోతే మాటల్తో చంపేట్టున్నాడని... "మాటలు నేర్చావు వెధవాయ్!" ఉడుక్కున్నాడు, సెల్ అందిస్తూ.

'టట్టడాం' చానల్ వాళ్లు గంట సేపు సాగదీసిన వెర్రిమొర్రి ప్రశ్నలకు జవాబులు రాక, నీళ్లు నమిలిన జూనియర్, వేడెక్కిన బుర్రతో బిక్కుబిక్కుమంటూ వెళ్లి సెల్ తండ్రికి అప్పగించాడు.

షరా మామూలే!

సెల్ కొన్నందుకే తగిన శాస్తి జరిగిందని బేర్ర్ మన్నాడు గోపాలం!

000

ప్రతి నెలా సోదికబుర్లకి, సొల్లు కాల్స్‌కి సెల్ బిల్ ఘాటుగా తగులు తుండడంతో దంగైన గోపాలం, గింగిరాలు తిరిగి పోయాడు.

పెనం మీది పేలాల్లా చిటపటలాడిపోయాడు.

ఆఫీసులోనూ ఫ్రెండ్స్ దగ్గరా ఇదే తంతు...

"నీ కొత్త సెల్ ఓ సారివ్వవూ?" అని ఒకరు.

"నాకు లేదనా నిన్నడగడం?" అంటూ మరొకరు.

"ఒక్క కాల్‌కే నీ సొమ్మేం తరగదులే!" అలా ఇంకొకరు. ఎవర్ని అని ఏం లాభం?

అభిమన్యుని మరణానికి అందరూ కారకులైనట్లు... పరిచయం ఉన్న ప్రతి ఒక్కరూ గోపాలం సెల్‌తో ఆడుకుంటున్నవాళ్లే!

"సమయాన్నీ, నా జీతాన్నీ తెగదోచేస్తున్నా సెల్లూ... నీకో దండం!" అనుకొని, తుదకో స్ట్రాంగ్ నిర్ణయానికొచ్చేశాడు.

ఫలితంగా–

అందరికీ తెలియపరిచినట్టుంటుందని గోపాలం ఇంటి గుమ్మానికి వేలాడుతూ ఓ ఫ్లెక్సీ దర్శనమిచ్చింది.

దానిలో అక్షరాలిలా ఉన్నాయి.

"నా దగ్గర అమ్మకానికో మొబైల్ ఉంది. మీకు తోచినంత నాకిచ్చేసి వీలైనంత తొందరగా దీన్ని నా నుండి దూరం చేయవలసినదిగా విజ్ఞులందరికీ ఇదే నా మనవి."

సెల్ పాయింట్ వాళ్లక్కూడా ఈ కబురందించాడు!